క్లుప్తంగా

మహిళలను గౌరవించాలి



మహిళలను సత్కరిస్తున్న
మున్సిపల్ చైర్మన్, ప్రజా ప్రతినిధులు

వైరా: సృష్టికి మూలమైన స్త్రీని ప్రతి ఒక్కరూ గౌరవించాలని మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్ అన్నారు. శనివారం వైరా మున్సిపల్ కార్యాలయంలో మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్లు మాదినేని సునీత, కన్నెగంటి సునీత, దారెల్లి పవిత్రకుమారి, గుగులోత్ లక్ష్మీబాయి, కార్యాలయ మహిళా ఉద్యోగులు, మెప్మా ఆర్పీలను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, మున్సిపల్ కమిషనర్ చింతల వేణు తదితరులు పాల్గొన్నారు.

లింగగూడెంలో మహిళల ఆందోళన



లింగగూడెంలో ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

పెనుబల్లి: మండలంలోని లింగగూడెంలో తాగునీటి కోసం గ్రామస్తులు శనివారం ఆందోళన నిర్వహించారు. గ్రామంలో తాగునీటి సరఫరా చేయడం లేదంటూ మహిళలు ఖాళీ బిందెలతో గ్రామంలో రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. మండల అధికారులు కల్పించుకొని తాగునీరు సక్రమంగా సరఫరా చేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు ఆందోళన విరమించారు.

ఏన్కూరులో రైతులు..

ఏన్కూరు: మండల కేంద్రంలోని ఓ విత్తన దుకాణం ఎదుట శనివారం గార్లఒడ్డు గ్రామానికి చెందని రైతులు శనివారం ఆందోళన చేశారు. గార్లఒడ్డు గ్రామానికి చెందిన కొంత మంది రైతులు గత డిసెంబర్‌లో ఓ విత్తన దుకాణం నుంచి వరి విత్తనాలు తీసుకెళ్లి సుమారు 45 ఎకరాల్లో సాగు చేశారు. సమయానికి ముందే వరి ఈనడంతో రైతులు ఆవేదన చెందారు. దీంతో రైతులు ఏన్కూరు వచ్చి విత్తన దుకాణం ఎదుట ఆందోళన చేశారు. ఈ విషయం వ్యవసాయ అధికారులు, పోలీసులు దృష్టికి రాగా వారిని స్టేషన్‌కు తరలించారు. కంపెనీ వారు వచ్చి నష్టపరిహారం చెల్లించాలని లేనిచో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

బీటెక్ ఫలితాల్లో ప్రతిభ

కొణిజర్ల: శనివారం విడుదలైన ఇంజనీరింగ్ ఫలితాల్లో కొణిజర్ల మండలం తనికెళ్ల సమీపంలోని విజయ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి యూనివర్సిటీ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జాన్‌బాబు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల వైస్ చైర్మన్ పారుపల్లి విజయలక్ష్మి అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ చిన్నయ్య, డీన్ శ్రీనివాసరావు, డాక్టర్ హరి ప్రసాద్ పాల్గొన్నారు.

నామా ఫ్లెక్సీ చించివేతపై ఫిర్యాదు

వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడులో ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు ఫ్లెక్సీలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి చించి వేశారు. సదరు వ్యక్తులను గుర్తించి తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఎస్సై వంశీకృష్ణ భాగ్యరాజ్‌కు ఫిర్యాదు చేశారు.

ఆలయాల్లో అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీలో ఉన్న శ్రీ లక్ష్మి పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా వర్తక సంఘం ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు వేముల తిరుపతిరావు ప్రారంభించి మాట్లాడారు. పేదవాడి ఆకలి తీర్చేవిధంగా ప్రతి శనివారం వర్తక సంఘం శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం వద్ద దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో జగన్మోహన్ రావు, కృష్ణమూరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేంకటేశ్వర ఆలయ వార్షికోత్సవం

తల్లాడ: తల్లాడలోని హనుమత్‌పద్మావతి సమేత వేంకటేశ్వర ఆలయం 21వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గుర్రం శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు విశ్వక్సేనారాధనము, పుణ్యాహావచనము, అంకురారోపణము, అగ్ని ప్రతిష్టాపన, సోమవారం అష్టాక్ష రీ మహాయజ్ఞం, శ్రీనివాసస్వామి వారికి మోదకములు, శ్రీదేవి, భూదేవి, పద్మావతీ దేవి, గోదాదేవి అమ్మవార్లకు, ఆంజనేయ స్వామికి తులాభార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాత్రి 6 గంటలకు ఎదుర్కోలు ఉత్సవం, 8గంటలకు శ్రీనివాస కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. మంగళవారం వేంకటేశ్వర గోవింద పట్టాభిషేకం, గ్రామోత్సవం ఉంటుందని తెలిపారు.



జీరో బిల్లులు పొందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్న మాటూరుపేట ప్రజలు

విద్యుత్ వెలుగులు

- జీరో విద్యుత్ బిల్లుల జారీ
- అర్హులకు అందజేస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది
- ఆనందంలో లబ్ధిదారులు

సెక్షన్	గృహ విద్యుత్ వినియోగదారులు	లబ్ధిదారులు
మధిర టౌన్	13338	5579
మధిర రూరల్	8318	5582
ఎర్రుపాలెం	6855	4129
మామునూరు	6944	4883

మధిరరూరల్: తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గృహజ్యోతి పథకం అమల్లోకి వచ్చాక విద్యుత్ వినియోగదారుల్లో వెలుగులు కనిపిస్తున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను ఇచ్చింది. ఆ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్కొక్క హామీని నెరవేరుస్తుంది. దీనిలో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ ఉపయోగించే వారికి జీరో బిల్లు ఇస్తూ వినియోగదారులకు వెసులుబాటు కల్పించింది.

వేగంగా జీరో బిల్లుల జారీ..

విద్యుత్‌శాఖ అధికారులు గ్రామాలు, వార్డుల వారీగా శరవేగంగా విద్యుత్ బిల్లులు వినియోగదారులకు అందజేస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారుల ఆదేశాల మేరకు సిబ్బంది ప్రతి ఇంటిని పరిశీలించి నిబంధనలకు అనుగుణంగా ఉంటే వెంటనే జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం పదవితో పాటు విద్యుత్ శాఖ మంత్రిగా కూడా ఉండడంతో ఆ శాఖ అధికారులు, సిబ్బంది ఈ ప్రాంతంలో ఉత్తమ సేవలు అందిస్తున్నారని ప్రజలు చర్చించుకుంటున్నారు. మొట్టమొదటిసారిగా జీరో విద్యుత్ బిల్లును చూసి లబ్ధిదారులు సంబరపడుతున్నారు. అదే గతంలో అయితే ఎంత బిల్లు వస్తుందోనని ఆత్రుతగా ఎదురుచూసేవారు.

అద్దె వాసులకు కూడా..

సాదారణంగా పేదప్రజల ఇళ్లలో ఏసీలు, వాషింగ్ మిషన్లు వంటి విద్యుత్ పరికరాలు ఉండవు. ఒకటి లేదా రెండు ఫ్యాన్లు, బల్బులు మాత్రమే ఉంటాయి. దీంతో వారు నెలమొత్తం 200లోపు యూనిట్లు వినియోగిస్తారు. అటువంటివారు జిల్లాలో లక్షలాదిమంది పేద ప్రజలు ఈ పథకం కింద లబ్ధిదారులుగా ఎంపికయ్యారు. సిటీల్లో అద్దెకు ఉండే వారికి కూడా ఈ పథకాన్ని వర్తింపజేసి వారి జీవితాల్లో కూడా విద్యుత్ వెలుగులు నింపింది.

వేలాదిమందికి ఊరట..

మధిర విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో మధిర, ఎర్రుపాలెం మండలాలు ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో మొత్తం నాలుగు సెక్షన్లు ఉన్నాయి. మధిర విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 35,455 గృహ విద్యుత్ వినియోగదారులు ఉండగా ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకొని లబ్ధిదారులుగా ఎంపికైన వారు 20,273 మంది ఉన్నారు.

హెల్ప్ డెస్క్‌ల ఏర్పాటు..

ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్ చేసేందుకు ప్రైవేట్ సిబ్బందిని నియమించారు. ఒక్కొక్క దరఖాస్తు ఆన్‌లైన్ చేసేందుకు గానూ కంప్యూటర్ ఆపరేటర్‌కు రూ.15 చొప్పున డబ్బులు ఇచ్చేవిధంగా అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో వారికి వారం రోజులు మాత్రమే సమయం ఇవ్వడంతో హడావిడిగా ఆన్‌లైన్ చేయడం వల్ల కొంతమంది రేషన్ కార్డులు, ఆధార్ కార్డుల నంబర్లు తప్పుగా నమోదు చేశారు. దీంతో అర్హత కలిగి ఉండి కూడా లబ్ధిదారులుగా ఎంపిక కాలేకపోయారు. వారికి జీరో బిల్లులు రావడం లేదు. ఈ సమస్య పరిష్కారానికి గ్రామీణ ప్రాంతాల ప్రజల కోసం మండల పరిషత్ కార్యాలయంలో, మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ వినియోగదారుల కోసం మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్ లు ఏర్పాటు చేశారు. జీరో బిల్లులు రాకుండా గతంలో మాదిరిగా బిల్లులు రావడంతో అర్హత కలిగిన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. హెల్ప్ డెస్క్‌లో సరిచేయించుకుని విద్యుత్ అధికారులను సంప్రదిస్తే 24 గంటల్లోగా గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు మెసేజ్ వెంటనే సెల్‌ఫోన్‌కు వస్తుంది.

ఆన్‌లైన్ చేయించుకోవాలి..



ఆధార్ కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండి 200 యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగానికి జీరో బిల్లు పొందని వినియోగదారులు తక్షణమే మున్సిపాలిటీ పరిధిలోని వినియోగదారులు మధిర మున్సిపల్ ఆఫీస్‌లో, అదేవిధంగా మధిర, ఎర్రుపాలెం గ్రామీణ వినియోగదారులు ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్‌లో ఆన్‌లైన్ చేయించుకోవాలి.

– అనురాధ, ఏడీఈ విద్యుత్ సబ్ డివిజన్, మధిర

ఆనందంగా ఉంది..



ప్రతిరోజు కూలీ పనులకు వెళ్తుంటా. కూలీ డబ్బుల నుంచి నీళ్ల, పాలు, కరెంట్ బిల్లులు కాకుండా పిల్లల ఫీజులు, ఇంటి ఖర్చులు అన్ని చూసుకోవాలి. ప్రభుత్వం గృహజ్యోతి పథకం పెట్టి మాలాంటి పేదవారికి ఎంతో న్యాయం చేసింది. గతంలో కరెంట్ బిల్లు ప్రతి నెల రూ.500 నుంచి రూ.600 వరకు వచ్చేది. ఇప్పుడు ఒక్క రూపాయి కూడా చెల్లించే పనిలేదు. చాలా ఆనందంగా ఉంది.

– చిగుళ్ల జ్యోతి, మాటూరుపేట

కంప్యూటర్‌లో నమోదు కాలేదు..



అందరితోపాటు మాకు కూడా ఈ నెల జీరో బిల్లు వస్తుంది అనుకున్నాం. కానీ రూ.505 బిల్లు వచ్చింది. అయితే కంప్యూటర్లో సక్రమంగా నమోదు కాలేదంట. ఈ బిల్లు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని మండల ఆఫీసులో ఉన్న హెల్ప్ డెస్క్ వద్దకు వెళ్లాలని చెప్పారు. అక్కడికి వెళ్లి నమోదు చేయించిన తర్వాత వచ్చేనెల బిల్లు అయినా జీరో బిల్లు వస్తుందా రాదా అని ఆందోళనగా ఉంది.

– బొల్లెద్దు లూర్దు, మాటూరు పేట

జీరో బిల్ వచ్చింది..



గత అనేక సంవత్సరాలుగా లడక బజారులో అద్దె ఇంట్లో నివసిస్తున్నాను. తెల్ల రేషన్ కార్డు ఉంది ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోగా.. జీరో విద్యుత్ బిల్లు వచ్చింది. ప్రతి నెల కరెంట్ బిల్లు కట్టే ఖర్చు తగ్గింది. చాలా సంతోషంగా ఉంది.

ఎన్నికల ముందు అద్దె ఇంట్లో ఉన్న వారికి కూడా గృహజ్యోతి పథకం కింద జీరో బిల్లు ఇస్తామని చెబితే నమ్మలేకపోయాను.

– కనకాచారి, మధిర

వైభవంగా శివపార్వతుల కల్యాణం



సత్తుపల్లిటౌన్: బుగ్గపాడు శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్/తల్లాడ/ముదిగొండ: మహాశివరాత్రిని పురస్కరించుకొని మధిర పట్టణంలోని శివాలయాలతో శివపార్వతుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అదే విధంగా తల్లాడలోని రామలింగేశ్వర స్వామి దేవాలయంలో.. ఆలయ ప్రధాన అర్చకుడు కంచెల సతీష్ శర్మ ఆధ్వర్యంలో అర్చక బృందం ముందుగా గణపతిపూజ, పుణ్యాహావచనం, ఆ తర్వాత కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ముదిగొండలోని వల్లాపురం శ్రీమల్లిఖార్జునస్వామి, అమ్మపేటలోని శంభులింగేశ్వర స్వామి దేవాలయాల్లో అర్చకులు మునగలేటి వంశీశర్మ, మునగలేటి రమేష్ శర్మల ఆధ్వర్యంలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామికి లక్ష మల్లెలతో పుష్పార్చన నిర్వహించారు. శనివారం స్వామి వార్లను పల్లకిలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేసి.. అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు..

పెనుబల్లి: మండలంలోని నీలాద్రీశ్వరాలయంలో మల్లు నందిని, ఎమ్మెల్యే మట్టా రాగమయిలు శనివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చీకటి చిన్న నరసింహారావు, ఈఓ పాకాల వెంకటరమణ, నాయకులు వెంకటేశ్వరరావు, రామారావు, కరీముల్లా, నరసింహారెడ్డి, మనోహర్‌నాయుడు తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న
ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ఎమ్మెల్యే మట్టా రాగమయిని సన్మానిస్తున్న
కాంగ్రెస్ నాయకులు

ఏన్కూరు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ తెలిపారు. మండలంలోని జన్నారం, గంగులనాచారం, హిమాంనగర్, తిమ్మారావుపేట, గ్రామాల్లో రూ.18 లక్షల నిధులతో నిర్మాణం చేపట్టనున్న సీసీ రోడ్లకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లెల్లో రోడ్లు, సైడు డ్రెయిన్లు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. అనంతరం టీఎల్‌పేట ఎస్‌ఎస్పీ వంతెన వద్ద కొద్ద సేపు ఆగి వైరా రిజర్వాయర్‌కు నీళ్ల మళ్లించే విషయమై మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బుజ్జీ, ఎంపీపీ వరలక్ష్మి, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరావు, మండల పార్టీ అధ్యక్షుడు నరేందర్, ప్రహ్లాదరావు, ఈఈ వెంకటరెడ్డి, తహసీల్దార్ సీహెచ్ శేషగిరావు, ఎంపీడీఓ రమేష్ పాల్గొన్నారు.

వేంసూరు: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే మట్టా రాగమయి అన్నారు. మండలంలోని వేంసూరు, మర్లపాడు, రాయుడుపాలెం, మెద్దులగూడెం, బీరపల్లి, కుంచపర్తి గ్రామాల్లో రూ.కోటి 60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు సేవ చేయడానికే రాయకీయంలోకి వచ్చామని అన్నారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటికే నాలుగు గ్యారంటీలను అమలు చేసిందని ఈ నెల 11న మరో గ్యారంటీ అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సోమిరెడ్డి, రాఘవరెడ్డి, పక్కుద్దీన్, గోపాల కృష్ణ, షైజుద్దీన్, వెంకటేశ్వరరెడ్డి, వెంకటప్పరెడ్డి, శ్రీనివారెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంకటేశ్వరరావు, జగన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థినులు



సిల్వర్ మెడల్ సాధించిన విద్యార్థినులు

ముదిగొండ: అంతర్జాయ మహిళా దినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని క్రీడా మైదానంలో ఈ నెల 8న జరిగిన జిల్లాస్థాయి బాలికల ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మేడేపల్లిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సిల్వర్ మెడల్ సాధించారని పీఈటీ బియ్యాని కృష్ణయ్య తెలిపారు. ఆదర్శ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థినులు సిల్వర్ మెడల్ సాధించడం పట్ల మండల ఎంపీపీ సామినేని హరిప్రసాద్, ఉపాధ్యాయులు, పీఈటీ కృష్ణయ్యలు అభినందించారు.

టీపీజేఎంఏ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ప్రవీణ్‌రెడ్డి



పాల ప్రవీణ్‌రెడ్డి

సత్తుపల్లి: తెలంగాణ ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య సంఘ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా స్థానిక శ్రీవాణి బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పాల ప్రవీణ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైద్రాబాద్‌లో శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రవీణ్‌రెడ్డిని ఎన్నుకున్నారు. ఉమ్మడి ఖమ్మంజిల్లాలోని ప్రైవేట్ కళాశాలల సమస్యల పరిష్కారం కోసం కార్యవర్గంతో కలిసి పని చేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డికి సత్తుపల్లి ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్య బాధ్యులు జీవి లింగారెడ్డి, కూసంపూడి మధు, మందపాటి మమంద్రారెడ్డి, ఎస్‌సిహెచ్ రామకృష్ణమాచార్యులు అభినందనలు తెలిపారు.

సుభాష్ చంద్రబోస్ ఆశయాలను సాధిస్తాం



కొణిజర్ల: నివాళులర్పిస్తున్న
సీపీఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు

తల్లాడ/కొణిజర్ల: తల్లాడ మండలంలోని అంజనాపురం గ్రామంలో, కొణిజర్లలోని రామనర్సయ్య నగర్‌లో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో శనివారం గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు రాయల సుభాష్ చంద్ర బోస్ వర్ధంతిని ఘనంగా జరుపుకున్నారు. పలువురు చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన కోసం పీడిత అణగారిన వర్గాల ప్రజల పక్షాన పోరాడటానికి నేటి యువత సిద్ధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ఖమ్మం జిల్లా నాయకుడు ఎస్.కె.లాల్‌మియా, ఐఎఫ్‌టీయూ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాసరావు, రామారావు, కృష్ణయ్య, అంజి, అశ్విని, రామారావు, రాంబాబు, కృష్ణ, నరసింహరావు, గోపాలకృష్ణ, వెంకన్న, వైరా డివిజన్ నాయకుడు అప్పారావు, సీతారాములు, లక్ష్మీనారాయణ, కోటయ్య, రామకృష్ణ,, ఉపేందర్, రాంబాబు, అనంతరామయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం విజయవంతం



మధిర: వైద్య సేవలు అందిస్తున్న ఉద్యోగులు

మధిర: మహా శివరాత్రి సందర్భంగా మధిర శివాలయం ప్రాంగణంలో ఖమ్మం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి వరికూటి సుబ్బారావు ఆదేశాల మేరకు దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు పృథ్వీరాజ్ నాయక్ ఆధ్వర్యంలో పారా మెడికల్ సిబ్బంది రెండు రోజులు నుంచి నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరం విజయవంతమైంది. కార్యక్రమంలో ఆయుష్ వైద్యురాలు హేమలత, ఆరోగ్య పర్యవేక్షకులు సుబ్బలక్ష్మి, లంకా కొండయ్య, సనప గోవింద్, కౌసల్య పాల్గొన్నారు.

చిత్రపటాల ద్వారా ప్రచారం..

మధిర జాతరకు వచ్చిన భక్తులకు సామాజిక సేవకులు, హెల్త్ సూపర్వైజర్ లంకా కొండయ్య బృందం వివిధ వ్యాధులపై చిత్రపటాల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫీల్డ్ పారా మెడికల్ సిబ్బంది వి.విజయకుమారి, జె.విజయలక్ష్మి లీల, వై.లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్‌లు గుర్రం శ్రీనివాస్, సరిమళ్ళ నాగేశ్వరావు పాల్గొన్నారు.

కిష్టారంలో..

సత్తుపల్లిరూరల్: మండలంలోని కిష్టారం ఓసీ ప్రభావిత గ్రామమైన కిష్టారం అంబేడ్కర్‌నగర్, ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలేంరాజు ఆదేశాల మేరకు రెండో రోజు శనివారం సింగరేణి, గంగారం పీహెచ్‌సీల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కిష్టారం పీఓ ఎం.నర్సింహారావు హాజరయ్యారు. ఈ మెగా మెడికల్ క్యాంప్‌లో వివిధ మల్టీ స్పెషలిస్ట్ వైద్య నిపుణులు ఎముకల వైద్య నిపుణులు, చెస్ట్ ఫిజియన్ నిపుణులు, పిల్లల వైద్య నిపుణులు పాల్గొని వివిధ రకాల వైద్య, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఓ నర్సింహారావుతో పాటు మాజీ సర్పంచ్ రేణుక ఈశ్వర్, అప్పారావు, కోటయ్య, కృష్ణారావు, రమేష్, పి.శ్రీను, కె.రామారావు, గంగారం పీహెచ్‌సీ వైద్యులు అవినాష్, అజయ్, స్రవంతి, డిస్పెన్సరీ డాక్టర్ నరసింహారావు, శిరీష, సంక్షేమాధికారులు దేవదాసు, సందీప్, కిష్టారం గ్రామస్తులు పాల్గొన్నారు.

బనిగండ్లపాడులో ట్రాక్టర్ రివర్స్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న
ఆలయ కమిటీ చైర్మన్ పిచ్చిరెడ్డి

ఎర్రుపాలెం: మండలంలోని బనిగండ్లపాడు గ్రామంలో మహాశివరాత్రి సందర్భంగా కట్లేరులో శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం రెండు జిల్లాల స్థాయి (ఖమ్మం, ఎన్టీఆర్ జిల్లాలు)ట్రావర్ రివర్స్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆలయ కమిటీ చైర్మన్ యన్నం పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పెద్దమళ్ల మోహన్‌రావు, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, దాతలు శీలం పట్టాభి సీతారామిరెడ్డి, బిక్షపతి, పరమేశ్వరరెడ్డిలు లాంఛనంగా ప్రారంభించారు. ఈ పోటీల్లో 25 ట్రాక్టర్ల డైవర్లు పాల్గొన్నారు. కాగా ప్రథమ, ద్వితీయ బహుమతులను సఖినవీడు గ్రామానికి చెందిన మల్లారపు శ్రీనివాసరావు, యరమల నర్సిరెడ్డి గెలుపొందారు. తృతీయ బహుమతిని బుచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన శీలం రవీందర్ రెడ్డి, చతుర్థ బహుమతిని యరమల భాస్కర్‌రెడ్డి గెలుచుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, లక్ష్మణరావు, రాంబాబు, రవి, శ్రీనివాస్‌రెడ్డి, రామిరెడ్డి, కృష్టారెడ్డి, అప్పారావు, సత్యం, శ్రీను పాల్గొన్నారు.

ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా మేడారం ప్రసాదం పంపిణీ

కల్లూరు: ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా మేడారం ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని సత్తుపల్లి డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఎస్‌కే మునీర్ పాషతో కలిసి శనివారం కల్లూరులో ప్రారంభించారు. మేడారం జాతరకు వెల్లలేని వారి సౌకర్యార్థం వారి ఇంటి వద్దకే మేడారం ప్రసాదాన్ని పంపిణీ చేయాలన్న సంకల్పంతో ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా కేవలం రూ.299తో బుకింగ్‌లు ప్రారంభించారు. దీనికి విశేష స్పందన లభించింది. కల్లూరులో శనివారం ప్రసాద పంపిణీ కార్యక్రమంలో సత్తుపల్లి డిపో విలేజ్ బస్ ఆఫీసర్ కిన్నెర ఆనందరావు పాల్గొన్నారు.

నూతన ఉపాధ్యాయులకు సన్మానం

మధిర: నూతనంగా గురుకుల ఉపాధ్యాయులుగా నియామక పత్రాలు అందుకున్న ఉపాధ్యాయులను టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. మధిర పట్టణంలో ఉంటున్న ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి అభినందించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ, సీనియర్ నాయకులు రావిరాల లక్ష్మణ్‌రావు మాట్లాడారు. గురుకుల ఉపాధ్యాయులుగా నియామకపత్రం అందుకున్న సిరిమళ్ల ప్రవీణ్, బాజోజు శృతి, వేల్పుల కృష్ణాయమ్మలను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వినోద్ రావు, వీరయ్య, జీబీఎంఎస్ రాణి, కవిత, ఇబ్రహీం, చెన్నయ్య, సాధు సమాధానం, భాస్కరరావు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

సత్తుపల్లి: ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దండు ఆదినారాయణ కోరారు. శనివారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయికి వినతిపత్రం అందించి సత్కరించారు. మహాలక్ష్మి పథకం వల్ల ఆటో డ్రైవర్లు, ఓనర్లు తీవ్రంగా నష్టపోతున్నారని వారిని ప్రభుత్వం ఆదుకొని వారికి సంవత్సరానికి రూ.50వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో యూని యన్ నాయకులు యాకూబ్, షౌకత్, శ్రీనివాసరావు, వీరయ్య, అజయ్, వెంకట్రావ్, రమేష్, బాలాజీ, ప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ముదిగొండ/తల్లాడ/సత్తుపల్లిటౌన్: ముదిగొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ మేకపోతుల శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ పార్కు సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఫీడర్‌లలో, తల్లాడలోని ఇండస్ట్రీయల్ ఫీడర్‌లో మరమ్మతులు చేపడుతున్నందున విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు విద్యుత్ శాఖా ఏఈలు శరత్‌బాబు, రాజేష్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కల్గుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగ దారులు సహకరించాలన్నారు.

గుర్తింపు పత్రాలు ఇవ్వాలి

సత్తుపల్లిరూరల్: సింగరేణి యాజమాన్యం ఏఐటీయూసీకి రెండు సంవత్సరాల కాలపరిమితికి గుర్తింపు సంఘంగా పత్రాలు ఇవ్వాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహారావు కోరారు. సత్తుపల్లిలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు కెవి రమణ, ప్రకాష్, విజయ్‌కుమార్, నాగరాజు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి నిత్యావసరాలు పంపిణీ

కొణిజర్ల: కొణిజర్లకు చెందిన సీనియర్ నిరుపేద టైలర్ బొడ్డు శంకరరావు ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబాన్ని కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు పరామర్శించి ఆయన కుటుంబ సభ్యులకు రూ.82 వేలు నగదు, 75 కేజీల బియ్యం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దొడ్డ సీతారామయ్య, సాధు లక్ష్మణరావు, భద్రగిరి, అనంతోజు పుల్లయ్యచారి, కొణతం ఉమాశంకరరావు, రాయల నరసింహారావు, నెమలికొండ పుల్లయ్యచారి, యర్రా బాబు, షేక్ కరీమ్, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను గౌరవించాలి



పోటీలను ప్రారంభిస్తున్న సూర్య విక్రమాదిత్య

మధిర: సంస్కృతీ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తనయుడు సూర్య విక్రమాదిత్య అన్నారు. మధిర శివాలయం సమీపాన ఏర్పాటుచేసిన ఎద్దుల పూటి లాగుడు బల ప్రదర్శన పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, నాయకులు హన్మంతరావు, కోటేశ్వరరావు, సత్యంబాబు, రామారావు, నాగేశ్వరరావు, జగన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు పంపిణీ



గొడుగులు అందజేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

వైరా: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం వైరా లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలు చేసిన మహిళలను సత్కరించి చిరు వ్యాపారం చేసుకుంటున్న వీధి మహిళా వ్యాపారులకు గొడుగులు అందించారు. ఈ సందర్భంగా వీడీజీ-2 నంబూరి మధు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. వారికి దక్కవలసిన గుర్తింపును ఇవ్వడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఉపేందర్‌రావు, హంగర్ రిలీఫ్ డిస్ట్రిక్ట్ చైర్ పర్సన్ కేవీ ప్రసాద్, వెంకటేశ్వరరావు, సునీత, రామారావు, కృష్ణమూర్తి, సురేష్, రాము, కృష్ణార్జునరావు, నాగేశ్వరరావు, విజయరాణి, సరిత, అనురాధ నీరజ, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

మాల కమ్యూనిటీ మండల అధ్యక్షుడిగా చంద్రారావు



చంద్రారావు

చింతకాని: మండలంలోని సీతంపేట గ్రామానికి చెందిన శాసమ్ చంద్రారావు మాల కమ్యూనిటీ మండల అధ్యక్షుడిగా ఎంపికైయ్యారు. ఈ మేరకు మాల కమ్యూనిటీ జిల్లా అధ్యక్షుడు కందుల ఉపేందర్ నియామకపు పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను పరిరక్షించేందుకు, మాలల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు.